క్లుప్తంగా

వీఎన్ఆర్ జన్మదిన వేడుకలు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి(వీఎన్ఆర్) జన్మదిన వేడుకలను నగరంలో నిర్వహించారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కలిసి మొత్తం 106 కిలోల కేక్‌ను కట్ చేశారు. అనంతరం వేణుగోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, భాను అముదాల, రాజశేఖర్‌రెడ్డి, అరుణ్ ఆధ్వర్యంలో కొంగారెడ్డిపల్లెలో కరుమారియమ్మన్ ఆలయం, ప్రభుత్వ ఆస్పత్రి, వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సరళామేరి, మాజీ టౌన్‌బ్యాంక్ చైర్మన్ రాంగణేష్, గుడిపాల ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు, కార్పొరేటర్లు దినేష్‌రెడ్డి, కుమారస్వామిరెడ్డి, కేపీ శ్రీధర్, సూర్యప్రతాప్‌రెడ్డి, అను, హరిణిరెడ్డి, భాగ్యలక్ష్మి, ప్రతిమారెడ్డి, శాంతి, కృష్ణారెడ్డి, అప్పాజీ, సయ్యద్, రజనీకాంత్, సిలంబరసన్, కవిత తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల కేంద్రంలో

స్థానిక గంగనపల్లె వద్ద ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి జన్మదిన వేడుకలను కో–ఆప్షన్ సభ్యుడు అను ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్రంలో వృద్ధులతో కేక్ కట్ చేయించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఉపాధ్యాయురాలు మృతి


శిరీష (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(సోషియల్)గా పనిచేస్తున్న శిరీష మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఉపాధ్యాయురాలు మృతి వార్త తెలుసుకున్న సహోపాధ్యాయులు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలెక్టరేట్ మెయిన్ గేట్ మూసివేత


రోడ్డు చదును చేయకపోవడంతో మూసి ఉన్న కలెక్టరేట్ గేటు

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద దారి లేక ప్రజలు, సిబ్బంది లోనికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. కలెక్టరేట్ ఎదుట అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులు జరుగుతుండడంతో రెండు నెలలుగా మెయిన్ గేట్‌కు దారి లేకుండా పోయింది. ఆ పైప్‌లైన్ పనులు పది రోజుల క్రితం పూర్తయ్యాయి. అయితే పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ కలెక్టరేట్ మెయిన్ గేటు నుంచి లోనికి వెళ్లడానికి రోడ్డు చదును చేయడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి అధికారులను కలిసేందుకు వచ్చే ప్రజలు లోనికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే స్పందించి కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదుట రోడ్డును చదును చేయించాలని ప్రజలు, కలెక్టరేట్ సిబ్బంది కోరుతున్నారు.

తమ్ముళ్ల ఉపాధి వేట

ఉపాధి కూలీలపై టీడీపీ నేతలు ప్రతాపం చూపుతున్నారు. అక్రమార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించే కుట్రలకు తెరలేపారు. తమ పార్టీ అధికారంలో ఉందన్న అహంకారంతో అధికారులను గుప్పిట్లో పట్టుకున్నారు. ఫలితంగా గ్రామ పంచాయతీల్లో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. కూలీలు పనుల్లేకుండా అలమటిస్తున్నారు. పొట్ట కూటికోసం మళ్లీ వలస వెళ్లే పరిస్థితి ఎదురవుతోంది.

- ఉపాధి హామీ పనులకు టీడీపీ బ్రేకులు
- పనుల్లేక కూలీలు విలవిల
- తెలుగు తమ్ముళ్ల ఉచ్చులో అధికారులు
- క్షేత్ర సహాయకుల తొలగింపునకు కసరత్తు


చిత్తూరు మండలం చెర్లోపల్లి వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫోటో)

కాణిపాకం: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదాయ వనరులపై పంజా విసిరింది. అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఉపాధి హామీ పథకంపై పసుపు కత్తి వేలాడదీశారు. పనులు చేయకూడదంటూ అడ్డుపడుతున్నారు. క్షేత్ర సహాయకులను తొలగించాలని కుట్ర పన్నుతున్నారు. దీని దెబ్బకు ఉపాధి పనులు ఆగిపోయాయి. కూలీలకు కడుపు కోతలు మొదలయ్యాయి. అధికారులు టీడీపీ నేతల బెదిరింపులకు లొంగిపోయారు.

తగ్గుతున్న కూలీల సంఖ్య

వలసల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా కూలీలకు ఉపాధి కల్పిస్తూ అండగా నిలబడుతోంది. అయితే ఆ పథక లక్ష్యాన్ని తెలుగు తమ్ముళ్లు నీరుగారుస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో జాబ్‌కార్డులు 53,106 ఉండగా 90,560మంది కూలీలున్నారు. మే నెలకు ముందు పని చేసిన కుటుంబాల సంఖ్య 10వేల కంటే ఎక్కువగా ఉండేది. అయితే గత రెండు నెలలుగా కూలీల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. మేలో 10,633 కుటుంబాలు పనిచేయగా జూన్‌లో 5.486 కుటుంబాలు, జూలైలో ఇప్పటివరకు 5,091 కుటుంబాలు పనిచేశాయి. ఈ సంఖ్య తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణం టీడీపీ నాయకులేనని కూలీలు వాపోతున్నారు.

పనులు నిలుపుదల

ఉపాధి హామీ పనులు కల్పించడంలో క్షేత్ర సహాయకులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి వారం పనులను గుర్తించి మండల స్థాయి అధికారుల అనుమతితో కూలీలకు పనులు కల్పిస్తున్నారు. దీంతో పాటు ఉపాధిలో పలు రకాల పనులు జరుగుతున్నాయి. నీటి కందకాలు, ఫారంపాండ్స్, పొలం చుట్టూ కందకాలు వంటి పనులు జరుగుతుంటాయి. ఇలాంటి పనులను ఒప్పంద పద్ధతిలో టీడీపీ నాయకులే చేసుకునేందుకు వారికి అనుకూలమైన క్షేత్ర సహాయకులను నియమించుకోవాలని రంగంలోకి దిగారు. ఇప్పటికే పంచాయతీల్లో ఉపాధి పనులను ఆపేశారు. పనిచేస్తున్న సహాయకులను తొలగించి టీడీపీ నాయకులు చెప్పిన వారిని నియమించాలంటూ కుస్తీ పడుతున్నారు. మరికొన్ని పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు, టీఏలు, ఏపీఓలను బెదిరిస్తున్నారు. ఈ బెడదతో ఏపీఓలు టీడీపీ నేతలకు సలాం కొట్టాల్సిన పరిస్థితి నెలకొంది. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లను రాజీనామా చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న క్షేత్రసహాయకులపై తప్పుడు ఫిర్యాదులు పెట్టి తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. డ్వామా పీడీకి పంచాయతీల వారీగా మార్పు చేయాల్సిన వారి వివరాలను అందజేశారనే ఆరోపణలు వస్తున్నాయి. వలంటీర్ పోస్టుల భర్తీ ప్రక్రియపై స్పష్టత లేకపోవడంపై ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు టీడీపీలోని పలువురు కార్యకర్తలు పోటీ పడుతున్నారు. ఇక పనులు నిలిచిపోవడంతో కూలీలు పనులు లేక అలమటిస్తున్నారు. పనుల కోసం పట్టణ ప్రాంతాలకు పరుగులు పెడుతున్నారు.

తొలగించేందుకు కుయుక్తులు

అనుకూలంగా ఉండరని పలువురు క్షేత్రసహాయకుల తొలగింపు ప్రక్రియను టీడీపీ నాయకులు వేగవంతం చేస్తున్నారు. అక్రమంగా తొలగించాలని కుట్రలు చేస్తున్నారు. చిత్తూరు మండలంలో 12 మందిని, గుడిపాలలో 16 మందిని, పూతలపట్టులో 9 మంది, యాదమరిలో 5 మంది, తవణంపల్లిలో 03, ఐరాలలో 06, బంగారుపాళ్యంలో 14 మందిని తొలగించాలని నివేదిక తయారు చేశారు. వారి స్థానంలో టీడీపీ నాయకులు సిఫార్సు చేసిన వ్యక్తులకు ఇవ్వాలని అధికారులకు హుకుం జారీ చేశారు. దీంతో పలువురు క్షేత్రసహాయకులను పనులకు వెళ్లొద్దని నిలుపుదల చేశారు.

తెలుసుకుంటా

మండల స్థాయిలో ఏం జరుగుతోందో తెలియడం లేదు. పనులను ఆపేయమని ఎవరూ చెప్పలేదు. ఏపీఓలు ఆపేయమని చెప్పమని ఉంటే తెలుసుకుంటాను. పనులు మళ్లీ కొనసాగేలా చూస్తాను. కూలీలకు పనులు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాను. కానీ ఇంత వరకు ఒక్కరినీ కూడా తొలగించలేదు. టీడీపీ ఒత్తిళ్ల గురించి తెలియదు.

–సుబ్రమణ్యం, క్లస్టర్ ఏపీడీ, చిత్తూరు

ఉపాధిహామీ పథక వివరాలు

మండలం	జాబ్‌కార్డులు	కూలీలు	మేలో పనిచేసినవారు	జూన్‌లో	జూలైలో
చిత్తూరు	4954	8857	1201	704	324
గుడిపాల	5312	7053	1305	996	741
పూతలపట్టు	7345	12514	1515	301	410
ఐరాల	638	15951	2531	1220	1604
తవణంపల్లి	6393	11368	1202	974	788
యాదమరి	7124	11798	1768	1352	875
బంగారుపాళ్యం	12340	21019	2879	1291	1224

లక్ష్యాన్ని పూర్తి చేయకుంటే చర్యలు



తవణంపల్లి: ప్రభుత్వం నిర్దేశించిన ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని సకాలంలో పూర్తిచేయాలని డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం ఉపాధి సిబ్బందికి సూచించారు. మండలంలోని నలిశెట్టిపల్లె పంచాయతీలో బుధవారం జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మండల కేంద్రంలో ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని అధిగమించడానికి సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. లక్ష్యాన్ని పూర్తిచేయాలని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ లలిత, టీఏ వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారించండి


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక, కలెక్టరేట్ ద్వారా అందే ఫిర్యాదులు, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో అందే ఫిర్యాదులు, ఇతర వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్, డయల్ యువర్ ఎమ్మెల్యే, కలెక్టరేట్ ఫిర్యాదులు, ఇతర వినతులను పరిష్కరిస్తున్న తీరు, రిపోర్టింగ్ విధానంపై సంబంధిత విభాగాల అధికారులు, వార్డు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేయాలని, సంబంధిత వార్డు కార్యదర్శులతో పాటు సంబంధిత అధికారులు అర్జీదారులను కలిసి సమస్యపై చర్చించి పరిష్కరించాలని సూచించారు. ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మెప్మా శాఖలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన తీరును, రిపోర్టులను పరిశీలించారు. ఆర్థికపరమైన వాటితో ముడిపడ్డ సమస్యలపై సరైన కారణాలతో అర్జీదారునికి తెలియపరచాలన్నారు. ప్రజావేదిక పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఈ విషయంలో ఎక్కడా జాప్యం జరగరాదన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, మునిసిపల్ ఇంజనీరు గోమతి, ఇతర అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండి చెయ్యి


కొణతం చంద్రశేఖర్

ఐరాల: కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు మొండి చెయ్యి చూపిందని మండలానికి చెందిన ఏపీ నిరుద్యోగ వికలాంగుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్ మండిపడ్డారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని దివ్యాంగుల క్రీడలకు గతంలో రూ.76 కోట్లు ఉన్న కేటాయింపులను ప్రస్తుతం రూ.25 కోట్లకు తగ్గించడం బాధాకరమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను అమలు చేయాలన్నారు. ప్రతి శాఖలో సంబంధిత అధికారిచే పర్యవేక్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్యాలయం మార్పు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ఆహార తనిఖీ కార్యాలయాన్ని డీఎంహెచ్ఓ కార్యాలయం వెనుక వైపు ఉన్న డీఎల్‌డీఓ కార్యాలయ భవనం మొదటి అంతస్తుకు మార్చినట్లు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇంతకుమునుపు రామ్‌నగర్‌కాలనీలోని అద్దె భవనంలో కార్యాలయం ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వ భవనాన్ని కేటాయించడంతో మార్చారు. దీనిని లైసెన్సుదారులు, వినియోగదారులు దీనిని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

పీఆర్‌టీయూ చిత్తూరు అర్బన్ కమిటీ ఎన్నిక



ఏకాంబరం రెడ్డి, ప్రతాప్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ) చిత్తూరు అర్బన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు చిత్తూరు అర్బన్ కమిటీ అధ్యక్షులుగా ఏకాంబరం రెడ్డి (స్కూల్ అసిస్టెంట్, గిరింపేట, మున్సిపల్ పాఠశాల), ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌కుమార్(ఎస్జీటీ, ప్రశాంత్‌నగర్, మున్సిపల్ పాఠశాల), గౌరవ అధ్యక్షులుగా విజయలక్ష్మి (ఎస్జీటీ, గిరింపేట, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల), రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా చింత వెంకటేశ్వర్లు (స్కూల్ అసిస్టెంట్, గిరింపేట మున్సిపల్ పాఠశాల)ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎన్నికైన వారికి ఆ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

గ్రామీణులకు ఉచిత వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ముత్తుకూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. కంటివ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



బంగారుపాళెం, మంగళపల్లెలో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె ఉన్నత పాఠశాలలో చదువుతున్న 3, 4, 5వ తరగతి విద్యార్థులకు బుధవారం ఉచితంగా విద్యాసామగ్రిని అందజేశారు. కొత్తకోట రాజ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు యాగమూర్తి విద్యార్థులకు నోటుపుస్తకాలు, పేనాలు, పెన్సిళ్లు అందజేశారు. దాత మాట్లాడుతూ, తన కుమారుడు రాజ్‌కుమార్ పేరుతో సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తనవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సంజీవి, ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు భూమిక, డిల్లీరాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 150 మందికి విద్యా సామగ్రి

తవణంపల్లి: మండలంలోని దిగువమోదల పల్లె పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కొత్తకోట రాజకుమార్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు నోటు బుక్, పెన్నులు, పెన్సిళ్లు తదితర సామగ్రి అందజేశారు. మాజీ సర్పంచ్ కన్నమందడి మాట్లాడుతూ తన మనవడు రాజకుమార్ యాదవ్ మృతి చెందడంతో అతని జ్ఞాపకార్థం, అతని జన్మదిన సందర్భంగా విద్యార్థులకు తమవంతు సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పొన్నేడుపల్లి ఉర్దూ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, వడ్డిపల్లి, మోదలపల్లి, చిగరాకులపల్లి, పాఠశాలల ఉపాధ్యాయులు, దాత యాదమూర్తి యాదవ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించండి


దిగువమాఘంలో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి ప్రియాంక

తవణంపల్లి: మండలంలోని గ్రామాల్లో జ్వర పీడితలను గుర్తించి రక్త నమూనాలను సేకరించాలని వైద్యాధికారి ప్రియాంక వైద్యసిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దిగువమాఘం, పైమఘం గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి వల్ల ప్రజలు జ్వరాలబారిన పడే అవకాశం ఉందని వివరించారు. వైద్య సిబ్బంది లార్వా దశలోని దోమలను నిర్మూలించడానికి పటిష్టంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధి సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం దిగువమాఘం సచివాలయంలో వైద్య సిబ్బంది రికార్డులను పరిశీలించి, వారికి సూచన సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో రోడ్ల విస్తరణకు సర్వే

- హై రోడ్డుపై కార్పొరేషన్ అధికారుల సర్వే
- వంద అడుగుల రోడ్డు విస్తరణకు మార్కింగ్
- కోర్టు మెట్లు ఎక్కిన వారి పరిస్థితి ఏంటో?
- పరిహారానికి బదులు టీడీఆర్ బాండ్లు



నగరంలో హై రోడ్డు విస్తరణకు సర్వే చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో హై రోడ్డును విస్తరించే విషయం మరోమారు తెరపైకి వచ్చింది. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రస్తుతం హైరోడ్డు విస్తీర్ణం గణాంకాలను పరిశీలిస్తూ సర్వే చేపడుతున్నారు. అన్ని వర్గాలను ఒప్పించి హై రోడ్డు విస్తరణ చేస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యకు ఉపశమనం లభించినట్లే అవుతుంది. అలా కాకుండా కార్పొరేషన్ అధికారులను వెంటాడుతున్న అవినీతి మరకల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి రోడ్డు విస్తరణ అంశాన్ని తీసుకొస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదనే వాదన కూడా వినిపిస్తోంది.

మాస్టర్ ప్లాన్‌లో వంద అడుగులు

నగరంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న సంతపేట రోడ్డు విస్తరణతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారనే చెప్పవచ్చు. హైరోడ్డుతో పాటు మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉన్న పుత్తూరు రోడ్డు, తిరుపతి రోడ్డు, వేలూరు రోడ్డు, పలమనేరు రోడ్డును కూడా విస్తరించాల్సి ఉంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం నగరం నలువైపులా ఉన్న రోడ్లను వంద అడుగుల వరకు విస్తరించాలి. ఈ నాలుగు వైపులా ఎన్ని అడుగుల రోడ్డు ఉంది ? ఎంత మేరకు విస్తరించాలి? ఎన్ని కి.మీ విస్తరించాలనే దానిపై అధికారులు ఆగమేఘాల మీద సర్వే ప్రారంభించారు. ప్రాథమికంగా గాంధీ విగ్రహం నుంచి ఎంఎస్ఆర్ కూడలి వరకు కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక యంత్రాంగం సర్వే పనులు ప్రారంభించింది. రెండు రోజుల పాటు ఈ సర్వే పనులు చేసి, విస్తరించాల్సిన స్థలాన్ని మార్కింగ్ చేస్తారు. ప్రస్తుతం గాంధీ విగ్రహం నుంచి ఎంఎస్ఆర్ కూడలి వరకు ఉన్న జాతీయ రహదారి 40 నుంచి 50 అడుగుల వెడల్పుతో ఉంది. మాస్టర్ ప్లాన్‌లో ఇది వంద అడుగుల వెడల్పు వరకు ఉండాలని ప్రతిపాదనలు ఉన్నాయి. కనీసం 80 అడుగుల వరకు విస్తరిస్తే తప్ప ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదని అధికారులు భావిస్తున్నారు.

సాధ్యమేనా?

రోడ్డు విస్తరణ పనులు పూర్తిగా ఆర్థిక అంశాలతో కూడుకున్న పని. పరిహారం చెల్లింపు విషయంలో కూటమి ప్రభుత్వానికి చెందిన కొందరు వ్యక్తులు గతంలో కోర్టు మెట్లు ఎక్కారు. విస్తరణలో భవనాలు కోల్పోయే తమకు పరిహారం ఇవ్వాలని చెబుతున్నారు. విజయవాడ, విశాఖ పట్టణాల్లో జరిగిన విస్తరణ పనుల్లో ఎక్కడా పరిహారం ఇవ్వలేదని అధికారులు గుర్తు చేస్తున్నారు. పరిహారానికి బదులుగా భూములు కోల్పోయేవాళ్లకు ట్రాన్స్‌ఫరబల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ద్వారా ఆర్థిక విలువ సూచించే బాండ్లను ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. దీనిపై భవన యజమానుల తీరు ఎలా ఉంటుందో వేచి చూడాలి. పనిలో పనిగా కొంగారెడ్డిపల్లె రోడ్డును విస్తరిస్తే అందరూ హర్షిస్తారనే వాదన వినిపిస్తోంది. చిత్తూరు నగరంలో రోడ్ల విస్తరణపై భిన్నవాదనలు తెరపైకి వస్తున్న నేపథ్యంలో తుది నిర్ణయం ఎలా ఉంటుందోనని ఆసక్తిగా గమనిస్తున్నారు.

చట్టం పరిధి మేరకే

హై రోడ్డు విస్తరణకు ప్రస్తుతం సర్వే పనులు జరుగుతున్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంది. ఇందులో కోర్టు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విస్తరణలో చట్టంలో ఉన్న నిబంధనలు పాటించాలని చెప్పిందే తప్ప.. విస్తరణ చేయొద్దని చెప్పలేదు. భూములు కోల్పోయేవాళ్లకు పరిహారంకు బదులు టీడీఆర్ బాండ్లను పంపిణీ చేస్తాం. ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ ఆదేశాలతో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటాం.

– రామకృష్ణుడు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్.

రైతులకు ఉచితంగా కూరగాయల నారు

బంగారుపాళెం: కూరగాయ పంటలు సాగు చేసే రైతులకు ఉచితంగా నారు అందుబాటులో ఉందని మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యానశాఖ తరఫున కుప్పం పట్టణంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా వివిధ రకాల కూరగాయల నారు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వంకాయ, బీరకాయ, సొరకాయ నారు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన రైతులు తీసుకోవాలని సూచించారు.